ఆమె తలుపు తీయగానే పోస్టుమెన్ అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు. రోడ్డు చివర్లో కిళ్ళీకొట్టు దగ్గిర ఎప్పుడూ నిలబడి ఆమెని చూసే నారోపాంటు కుర్రవాడు ఆమె కాలేజీకి వెళుతుంటే అటు చూసి ఏదో షాక్ తగిలినట్టు మొహం చప్పున తిప్పుకున్నాడు. ఇద్దరూ రౌడీల్లా వున్న వాళ్ళు ఆమె నడుస్తూంటే రోడ్ల పక్కన వొద్దిగ్గా నిలబడి ఆమె దాటి వెళ్ళే వరకూ అలాగే వుండిపోయారు. క్లాసులో ఎప్పుడూ ఆమెనే చూస్తూ పాఠం చెప్పే కుర్ర లెక్చరర్ అసలామె వైపు చూడలేదు. అంత వరకూ ఎందుకు? ఏమీ తెలియని విష్ణూయే ఆంటీ నిన్ను చూస్తూంటే ఏదో భయంగా వుంది అన్నాడు పక్కింటి విశ్వనాథం కూడా ఆమె పాలకోసం వెళితే చప్పున మొహానికి పేపరు అడ్డు పెట్టేసుకున్నాడు. ఆమె చీకట్లో నడిచి వస్తూంటే వెనుకనుంచి సైకిల్ మీద వస్తూ ఆమె మెడలో గొలుసు లాగేసుకుందామనుకున్న దొంగ కూడ ఆ తాయెత్తు తగిలేసరికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టు అల్లంత దూరంలో పడి అదే వేగంతో సైకిల్ తీసుకుని కూతవేటు కందనంత దూరం పారిపోయాడు.

వరుసగా ఆ రోజు జరిగిన సంఘటనలతో మాలకి తను ధరించిన తాయెత్తుపై నమ్మకం కుదిరింది. జేబులో బొమ్మ ..... జేజేల బొమ్మ లాంటి సైకాలజికల్ ధైర్యం కలిగింది. మనసులోనే బామ్మకి కృతజ్ఞత చెప్పుకుంది.

జరిగిన సంఘటనల్లో సగం విహారి, బామ్మ కలిసి ఏర్పాటు చేసినవని ఆమెకు తెలీదు.

ద్వాదాశి రావటానికి ఇంకా నాలుగు రోజులు టైముంది.

*                    *                    *

విహారి తల్లితో కలిసి ఇంటికొచ్చిన తరువాత ఓ రెండు గంటల తరువాత వివిధ పత్రికలకి ఫోన్ చేశాడు. స్వామి భవంతిలో బాంబు వున్నట్టు తెలిసిందని అధికార స్వరంతో చెప్పి ఫోన్ పెట్టేశాడు. చాలా మంది అది నమ్మలేదు. నమ్మిన ఇద్దరు ముగ్గురు విలేఖరులు హడావుడిగా స్వామి ప్యాలేస్‌కు బయల్దేరారు విహారి కూడా ఇంటినుంచి బయటకొచ్చి స్వామి మహల్‌కి దగ్గిరగా వున్న బూత్‌లోంచి అయనకు ఫోన్ చేశాడు.

స్వామి ప్రస్తుతం కోటి పుష్పార్చనలో వున్నాడు. ఎవరితోనూ మాట్లాడరు అంది సెక్రటరీ అట్నుంచి.

విహారి అని చెప్పు తాయెత్తు గురించి అని చెప్తే పరుగెత్తుకు వస్తాడు అన్నాడు అతడు చెప్పినట్టే విషయం తరువాత స్వామి లైన్‌లోకి వచ్చాడు.

ఏమిటి తాయెత్తు అన్నావట అన్నాడు స్వామి అతడి గొంతులో అనుమానం ధ్వనించింది.

మండూక మహత్తుగల తాయెత్తుకి ప్రతిగా మార్జాల మహత్తుగల బహుమతి ఇచ్చాను. ఏం చేశారు స్వామీ? అని అడిగాడు. ఆ ప్రశ్నకి స్వామి రిలీఫ్‌గా పీలయ్యాడు. తాయెత్తు సంగతి విహారికి తెలియలేదు అన్న సంతోషంతో నాకు రోజుకి వేల సంఖ్యలో బహుమతులు వస్తూ వుంటాయి. విప్పటానికి నా నౌఖర్లకి కూడ నాల్రోజులు పడుతుంది అన్నాడు.

“నాల్రోజులా? అదేం, ఎలా స్వామీ? మరో నాలుగు నిమిషాల్లో అందులో బాంబు

పేలుతుందే?

వ్వాట్?

గుట్టలు గుట్టలుగా మీ పక్కన పడివున్న ఆ బహుమతుల్లోంచి నాలుగు నిమిషాల్లో నేనిచ్చిన ప్యాకెట్ బయటకు తీయించండి. లేదా మీరే నాలుగు నిమిషాల్లోగా ఆ ఇంట్లోంచి బయటపడండి శత్రువుల్ని చంపుకోవటం మన అగ్రిమెంటులో లేదుగా. అందుకే ఫోన్ చేసి చెపుతున్నాను క్విక్ అని ఫోన్ పెట్టేసి బయటకొచ్చాడు.

దూరంగా మహల్ కనపడుతోంది స్వామి అనుచరుల్తో సహా బయటకు పరుగెత్తుకొస్తున్నాడు. అదే సమయానికి ఇద్దరు ముగ్గురు విలేఖరులు అక్కడికి చేరుకొంటున్నారు విహారి వరుసగా..... రకరకాల కోణాల్లో ..... తన చేతిలో కెమెరాని క్లిక్ క్లిక్ మనిపించాడు.

సరీగ్గా ఇక్కడే విహారి స్కేర్ చేశాడు. ఎవరో అనామకుడినుంచి ఫోన్ వస్తే పత్రికాఫీసుల్నించి విలేఖరులు వెళ్ళరు. అలాగే వెళ్ళలేదు కూడా ఇప్పుడు ఆ వార్త నిజమయింది. కేవలం ఇద్దరు ముగ్గురు విలేఖరులు ఆ దృష్యాన్ని ప్రత్యక్షంగా చూడగలిగారు. మిగతా పత్రికలకి బాంబే స్కేర్ కేవలం వార్త మాత్రమే అయింది. అటువంటి వారికి విహారి ఆ ఫోటోలు అందజేశాడు. సెన్సేషనలిజం కన్నా కావాల్సింది ఏముంది? స్పాట్‌కి వెళ్ళిన విలేఖరుల్తో పాటూ వెళ్ళని పత్రికలకు ఫోటోలు దొరికాయి అనంతానంతస్వామి పైబట్ట లేకుండా బయటకు వస్తున్న ఫోటో అనుచరులు పరుగెత్తుకు వస్తూన్న ఫోటో వగైరా రకరకాల పత్రికల్లో పడ్డాయి ఎవరూ చెడుగా వ్రాయలేదు.

అనంతానంతస్వామి మహల్లో బాంబు భయం లాంటి హెడ్డింగులే పెట్టాయి కానీ జనవాక్య కల్పిత రూమర్‌కు పరిధులేముంటాయి? ఏ అమాయకత్వం మీద ఆడుకున్నాడో ఆ అమాయక ప్రజలే చిన్న బాంబు భయంతో భగవత్‌స్వరూపుడయిన స్వామి బయటకు పరుగెత్తుకు రావటమూ? అన్న సంశయం వెలిబుచ్చాయి ఆ వార్త స్వామిని కూడా చేరింది. అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగిలిన వాడికి పెద్ద విషయం కాదు కానీ అసలు ఓటమే ఎరుగనివాడు చిన్న ఎదురు తాకిడి తలిగినా సహించలేదు. స్వామి విషయంలో అదే జరిగింది. చాలా చిన్న వాడు అనుకున్న విహారి కంట్లో నలుసుగా బాధ పెడుతున్నాడు.

మామూళు సమయాల్లో అయితే ఏం చేసేవాడో కానీ సరిగ్గా అదే సమయంలో రామ్‌లాల్ వచ్చి ఒక వార్త చెప్పాడు సి.బి.ఐ చీఫ్‌ని ట్రాన్స్‌ఫర్ చేయటానికి ప్రయత్నం జరుగుతున్నట్టు వార్త రహస్యంగా తెలిసిందని ఇది వూహించని రెండో దెబ్బ.

ఏమైంది? అన్నాడు స్వామి ఇరిటేటెడ్‌గా.

నిన్న ప్రవల్లిక ప్రధానమంత్రిని కలుసుకుంది.

అనంతానంతస్వామి భృకుటి ముడిపడింది. దాని పర్యవసానమే ఇదంటావా? అన్నాడు

రామ్‌లాల్ మాట్లాడలేదు.

అనంతానంతస్వామి కొద్దిసేపు ఆలోచించి అడ్డంగా విదిలిస్తూ లాభం లేదు రామ్‌లాల్ వాళ్ళు ఇద్దర్నీ చాలా కాలం ఉపేక్షించాం ఇక వద్దు అన్నాడు ఒక నిర్ణయానికి వచ్చినట్టు.

రామ్‌లాల్ తలూపి రేపట్లోగా పూర్తి చేస్తాను.

ఇద్దర్నీ వీలైతే ఒకేసారి చంపు విడివిడిగా వద్దు.

రామ్‌లాల్ తలూపి అక్కడనుంచి వెళ్ళిపోయాడు ఎంత పెద్ద నిర్ణయాలైన ఇంతకన్నా పెద్ద మాటలు జరగవు వారిమధ్య.

*　　　　　　　　*　　　　　　　　*

ప్రభుత్వం సి. బి. ఐ. చీఫ్ ట్రాన్స్‌ఫర్ చేసే చర్య ఎందుకు తీసుకోవలసి వచ్చిందో తెలియాలంటే రెండు రోజులు వెనక్కి వెళ్ళాలి.

అప్పటికే పరమేశ్వరం వ్యూహం ప్రకారం దేశంలో పరిస్థితులు నెమ్మదిగా అల్లకల్లోలం అవటం ప్రారంభించాయి మాజీ కేంద్రమంతి ఒకరు ప్రధానితో విభేదాలు వచ్చిన మంత్రి ఒకరు ఒకరోజు తేడాతో హత్య చేయబడ్డారు. ప్రధానికి చాలా ఇబ్బందికరమైన స్థితి ఇది. లొసుగులు బయట పెట్టకుండా వారిని అధికార పార్టీయే హత్య చేయించిందని జనం అనుకోవటం తప్పేముంది? ఆ విధంగా స్వామి మొదటి ఎత్తు పూర్తయింది (విజయ దశమికి ఇంకా కొద్ది రోజులే టైముంది).

ప్రధానమంత్రి ఈ హత్యల విషయమై సి.బి.ఐ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేశాడు. మీటింగ్ అయిపోయిన తర్వాత ప్రవల్లిక మరికొంచెం సేపు ఆగిపోయింది. డిపార్ట్‌మెంట్ రహస్యాలు బైటికి పొక్కడంతో సహా దేశం త్వరలో ఎదుర్కోబోతున్న పరిస్థితులపట్ల తయారు చేసిన రహస్య నివేదికని కూడా అందజేసింది. ఆయన ఆందోళన చెందాడు ఏం చేద్దాం అని అడిగింది.

ముందీ రహస్యాలు బయటకు ఎలా అందుతున్నాయో వాళ్ళని పట్టుకోవాలి దీనికి మా డిపార్ట్‌మెంట్ కాకుండా వేరే ఆఫీసర్లని ముగ్గురిని నాకిస్తే ..... అంటూ తన ప్లాన్ వివరించింది. అంతా విని అయన గుడ్ అన్నాడు.

రా(RAW) నుంచి నమ్మకస్తులైన ముగ్గురు ఆఫీసర్లు ఈ పనిమీద నియమించబడ్డారు. తను అనుకున్న పని ముందు చీఫ్‌తో ప్రారంభించ దల్చుకుంది ఆమె.

హడావుడిగా చీఫ్ దగ్గరకు వెళ్ళి మన అఫీసర్లు ఒక హార్డ్‌కోర్ టెర్రరిస్టుని పట్టుకున్నారు సార్ చిన్నపిల్లలు కిడ్నాప్‌తో సంబంధం వున్న వ్యక్తి అనుకుంటాను అంటూ అతడిని ఎక్కడ వుంచి ఇంటరాగేట్ చేస్తున్నారో ఆ ప్రదేశం చెప్పింది.

అదంతా అబద్ధమే. ఆ ప్రదేశం పైకి మామూలు ఇల్లులా కనపడే ఒక సి.బి.ఐ ప్లేసు ఇలాంటి అబద్ధం చెప్పడం కోసమే ఆమె ప్రధానమంత్రి నుంచి పర్మిషన్ తీసుకున్నది.

జరిపారు. ఆ ఇల్లు నిర్మానుష్యంగా వుంది. ఇది వేరే సంగతి. చాలా చిన్న ట్రిక్ ద్వారా ఆమె ఎవరివల్ల రహస్యాలు బయటకు పొక్కుతున్నాయో తెలుసుకోగలిగింది.

కానీ ఆ అరగంటసేపూ చీఫ్ బయటకు ఎవరి ద్వారానూ వార్త పంపలేదనీ ఫోన్ చెయ్యలేదనీ ప్రధానమంత్రి పాయింట్ చేసినాఫీసర్లు ధృవీకరించారు.

మరి ఈ వార్త అనంతానంతస్వామికి ఎలా తెలిసింది?

ఏ రుజువులూ లేకుండా చీఫ్ మీద చర్య తీసుకోలేదు. అతడిని సస్పెండ్ చేయలేదు. క్షణాలమీద అతడి ట్రాన్స్‌ఫర్‌కి ఉత్తర్వులు ఇవ్వబడ్డాయి

స్వామి ఈ రంగంలోనే ప్రవల్లికని తుడిచి పెట్టమని రామ్‌లాల్‌కి ఆజ్ఞ ఇచ్చాడు.

ఆమెతోపాటు విహారిని కూడా.

*                    *                    *

రేపొకసారి కిద్వాయ్ గార్డెన్స్‌కి వెళ్దామా? అని అడిగింది ప్రవల్లిక.

ఎందుకు? అడిగాడు విహారి నవ్వుతూ ఏదైనా సి.బి.ఐ పనా?

కాదు స్వంతపనే రేపు ద్వాదశి మర్చిపోయారా?

మర్చిపోలేదు అందుకే ఈ రాత్రి లోపులో పూర్తి చేయవలసిన పని ఒకటున్నది సునాదమాలను తల్చుకుంటూ తనలో తనే అనుకుంటున్నట్టు అన్నాడు.

సరే ఆ పనేదో రాత్రికి పూర్తి చేసుకోండి రేపుమాత్రం నాతో రావడానికి రెడీగా వుండండి మీకో మంచి వార్త చెపుతాను నవ్వుతూ అన్నది. చీఫ్ బదిలీతో ఆమె సంతోషంగా వుంది. పేపర్లో స్వామి గురించి వచ్చిన వార్తపట్ల విహారి కూడా సంతోషంగా వున్నాడు.

అన్నట్టు ద్వాదశినాడు మీ నాన్నగారు మా ఇంటికి వస్తానన్నట్టున్నాడు. అప్పుడు నేను వుండనవసరం లేదా?

అవసరం లేదు మహాశయా మీరు నాతో రండి. వాళ్లేం మాట్లాడుకున్నారో తర్వాత విందురు గాన్లెండి.

అలాగే.

బై రేపు కలుద్దాం.

బై....

ఈ సంభాషణ జరిగిన పది నిమిషాలకి రామ్‌లాల్ టేబిల్ మీద మొత్తం నగరం తాలూకు ట్రాఫిక్ ప్లాన్ వుంది.

మరుసటి రోజు విహారి ప్రవల్లిక ఏ దారిగుండా ప్రయాణం చేస్తారో బాణం గుర్తుల ద్వారా సూచించబడి వుంది. మిషన్‌గన్‌తో ఏ జంక్షన్‌లో కాల్పులు జరపాలి. ఎటుగుండా పారిపోవాలి అక్కడ ఆగి నెంబర్లు ప్లేటు మార్చుకోవాలి అన్న గుర్తులు క్లియర్‌గా వేసి వున్నాయి. మొదటి కారులో నుంచి జరిగే కాల్పులవల్ల ఒకవేళ ఇద్దరూ మరణించక పోతే, అవతలివైపు నుంచి

సూచించాడు రామ్‌లాల్.

ఇటువంటి ప్లాన్ చేయడంలో రామ్‌లాల్‌కి మించినవాడు లేడు. అందులోనూ పాతకక్షలు కూడా వున్నాయి. ఇన్నాళ్ళూ కేవలం స్వామి ఆజ్ఞ కోసం ఆగాడు. ఇప్పుడిక అతడిని ఆపేవారు లేరు.

సెకన్లతో సహా జాగ్రత్తగా ప్లాన్‌వేసి మరుసటిరోజు కోసం ఎదురు చూడసాగాడు

14

ఇప్పుడు సినిమాకా? అంది సునాదమాల కళ్ళు పెద్దవిచేసి ..... నీకు నిజంగా మతిపోయింది బామ్మ.

టైమెంతయిందనే తొమ్మిదన్నరేగా.

అయితే మాత్రం? మరీ సెకెండ్ షోకేమిటి?

నాకు మత్రం ఏం తెలుసు? కిరాయి మొగుడు ఈ రోజే ఆఖరి రోజట అదీ ఫస్ట్ షో టైమ్‌దాటాక చెప్పింది పక్కింటి సుబ్బమ్మ. ఇంకో రెండు వారాలైన ఆడుతుందేమో అనుకున్నాను. మరీ స్లాబ్ సిస్టమ్ వచ్చాక కాస్త కలెక్షన్స్ తగ్గిపోతే తీసేస్తున్నారు.

ఇప్పుడు పురాణం విప్పకు ఆ హాలు కాకపోతే రెపట్నుంచీ మరో హాలులో ఆడుతుంది.

ఆడకపోతే? ఎదురు ప్రశ్నించింది బామ్మ.

ఆడకపోతే పోతుంది విసుగ్గా అంది మాల అది చూడకపోతే కొంపలేం మునిగిపోవు.

ఎందుకు మునిగిపోవు? అసలా టైటిల్‌లోనే ఏదో గమ్మతుంది. లేకపోతే నాకు వారం రోజులుదాకా నిద్దర పట్టదు.

అయితే వెళ్లి చూడు.

నువ్వు రా.......

నేను సెకండ్‌షోలకి రాను అందులోనూ అటువంటి పిక్చర్లు అసలు చూడను.

బామ్మ విష్ణు వైపు తిరిగి నువ్వొస్తావా? అని అడిగింది వస్తానన్నాడు వాడు. కానీ సంధిగ్దంగా పిన్ని వైపు చూసి ఒక్కదానివీ ఉండగలవా? అన్నాడు.

నాకేం భయం అంది మాల.

తాయెత్తు కట్టాక ధైర్యం వచ్చిందా?

మీరు వెళితే వెళ్ళండి నా టైమ్ వేస్ట్ చేయకండి

ఇద్దరూ హడావుడిగా తయారై వెళ్ళిపోయారు. మరో గంటసేపు చదువుకుని నిద్రపోవడానికి ఉపక్రమించింది సునాదమాల.

అప్పుడైంది వంటింట్లో చప్పుడు.

ముందు ఆమెకు అనుమానం రాలేదు లోపల అడుగుల చప్పుడుకి లేచి కూర్చుంది.